("జ్యోతి" మాసపత్రిక ప్రమోద సంచిక, 1990)

ప్రతి రాత్రి వసంతరాత్రి

"అతన్ని నేను కూడా ఎరుగుదును" అంది వసంత.

"అంటే; అతనంటే నీ కిష్టమే అన్నమాట" అన్నాను పెద్దతనపు నవ్వు వొలకబోస్తూ.

"ఏమో, ఆ సంగతి నాకేం తెలుసు!?" అని వసంత ఆవలించి చిటికె కూడా వేసుకుని లేచి వెళ్ళిపోయింది.

వసంతకి ఇరవై ఆరో ఏడు నడుస్తోంది. అహమ్మదాబాద్‌లో మా బావగారు పనిచేస్తున్న సంస్థలో ఏదో చిన్న పుద్యోగం చేస్తోంది: మూడేళ్ళనుంచీను.

వసంత నా కోడలు కావలిసింది, అసలు. ఐదేళ్ళ కిందట మా ఆవిడ ద్వారానూ మా చెల్లెలి ద్వారానూ ఆ అవకాశం తప్పిపోయింది. నా వృద్ధాప్యంలో నన్ను అపేక్షగా చూసుకోగల పిల్ల పరాయిది అయిపోయింది.

"చిదిపి దీపం పెట్టొచ్చు" లాంటి నానుడులు పుట్టడానికి వసంతలాంటి ఆడపిల్లలే కారణం అయివుండాలి. కట్టూ బొట్టూ తలకట్టూ ఆడపిల్ల అందానికి వన్నె తెస్తాయంటారు. కాని వసంత సంగతి వేరు. దాని వొంటికున్న కాంతి, లావణ్యం ఎలాటివంటేను, అది ఎలాంటి బట్టలు కట్టుకున్నా ఆ బట్టలకి, తను జుట్టు ఎలా సవరించుకుంటే ఆ పద్ధతికి—వన్నెలు తెచ్చి మిగతా వాళ్ళలో ఆ అభిరుచిని ప్రవేశపెట్టే రకంవి, అవి.

సన్నంగా ఉన్నా పుష్టిగా, పొడుగ్గా ఉన్నా లలితంగా, చామనచాయగా ఉన్నా మెరుగ్గా, ఉండే వసంత; కేవలం విద్య యొసగిన వినయం వల్ల, పెద్దల యెడ గౌరవం మూలాన్నించి ఏర్పడిన మొహమాటం వల్ల, మా అబ్బాయి మీద తనకున్న ఇష్టాన్నీ నామీద తనకున్న ఆపేక్షనీ దాచేసుకుని, వాడు చేజారి పోతూ ఉంటే చూస్తూ వూరుకుండిపోయింది. అప్పుడు వసంతకి ఇరవై ఒకటి.

బావగారు అహమ్మదాబాద్‌లో ఉద్యోగంలో చేరిన కొత్తలో పుట్టింది వసంత. అగ్రహారంలో తాతగారింటిలో దాని బాల్యం గడిచింది. తాతగారూ నాయనమ్మా వసంతని ముద్దు చేసేరేగాని చదవ్వెయ్యలేదు. చదవ్వేస్తే ఉన్న

మతి పోతుందని భయం చేత కాదు, ఆడపిల్లలు చదువుకోనేకూడదని ఆ తాత గారూ నాయనమ్మా నమ్మడం వల్ల. రెండేళ్ళ మా చెల్లెలి అత్తవారితో దెబ్బ లాడగా దెబ్బలాడగా వసంతని విశాఖపట్నంలో మా ఇంటిలో వుంచి చదువులో ప్రవేశపెట్టడాని కొప్పుకున్నారు. ఏడోయేట బళ్లో చేరినా, అప్పటికే వాళ్ళ నాయనమ్మ నేర్పిన బాల రామాయణం శ్లోకాలు, సుమతీ శతకం, భాస్కర శతకం, కాళహస్తీశ్వర శతకం, భర్తృహరి నీతిశతకం అన్నీ కంఠతా రావడం వల్ల, పెద్ద బాలశిక్షలో ఉన్నపాటి లోకజ్ఞానం గళగ్రాహి అవడం వల్ల, అన్ని క్లాసుల్లోనూ విజ్ఞానదీపంగా వెలిగిందిగాని, ఇరవై ఒకటో ఏట ఇంకా బి. కాం. సెకండియర్‌లోనే ఉండిపోయింది.

మా అబ్బాయి అప్పటికి ఎమ్. కాం. ఫస్టుక్లాసులో పాసై, స్టాటిస్టిక్సులో ఒక డిప్లొమా, మేనేజిమెంటులో ఒక సర్టిఫికేటూ సంపాదించుకోడం వల్ల కలకత్తాలో ఒక గొప్ప ప్రయివేట్ కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. రెండు నెలలు హోటల్లో తిని, మరో రెండు నెలలు వండుకుని తిని ఆలోచనని దెబ్బ తీసేటంతగా ఆరోగ్యాన్ని నష్టపోయి జీతం నష్టంమీద సెలవుపెట్టేసి ఇంటి కొచ్చేడు. "అదేమిట్రా నా తండ్రీ అలా చీపురుపుల్లలాగైపోయేవూ?" అని మా ఆవిడ వాణ్ని పొదివి పట్టుకుని కన్నీళ్లు పెట్టుకుంది. "అక్కడ భోజనం సరిగా లేదమ్మా. ఏముంది, వారం రోజుల్లో నీ చేతి వంటతో మళ్ళీ మామూలుగా అయిపోతాన్లే" అన్నాడు.

"మనకెలాగూ వంట మనిషుంది కదా, నేను నానిగాడితో వెళ్ళిపోతానండీ:" అంది మా ఆవిడ, పదిరోజుల తరవాత కంపెనీ వాళ్ళిచ్చిన టెలిగ్రాం చూసుకుని వాడు ప్రయాణం అవుతూవుంటేను.

మామూలుగా అయితే "పిల్లాడికి పాతికేళ్ళు వెళ్లిపోయాయి కదండీ. ఏ వయస్సులో ముచ్చట ఆ వయస్సులో జరగాలి కదా, వాడికి పెళ్ళి చేసేద్దామండీ" అనవలసిన మా ఆవిడ ఇలా అనేసరికి నాకు తల తిరిగిపోయింది. "నువ్వెళ్తే సమస్య కొంతతీరుతుందనుకో గాని, అలా ఎన్నాళ్ళని? వాడికి పెళ్ళి చేసీడమే రైటు." అని నేనే అనవలిసొచ్చింది!

"అంత అర్జంటుగా సరైన పిల్ల దొరకొద్దూ?" అంది మా ఆవిడ.

"చంకలో పిల్లని పెట్టుకుని వూరంతా వెతికిందిట నీలాటిదే, ఎవత్తో!" అన్నాను.

"హవ్ వ్వ!" అని అరి చేతి దొప్పతో నోరు కొట్టుకుంది మా ఆవిడ.

"ఎదురు మేనరికం అచ్చిరాదన్న సంగతి చూడా మీకు తట్టలేదంటే మీ ప్రయోజకత్వం తెలుస్తూనే వుంది. పైగా వసంతకి దేశం కాని దేశంలో ఇల్లు దిద్దుకునే వయస్సేదీ?" అని నా ప్రతిపాదనని వీటో చేసేసింది. సరిగ్గా ఆ రాత్రే అగ్రహారం వెళ్ళిన మా బావగారూ, చెల్లెలూ వసంతా దిగేరు, అహమ్మదాబాదు వెళ్తూ. మా చెల్లీ మా ఆవిడా చెరో అయిదు వందల నోళ్ళు పెట్టుకుని వసంతకీ మా అబ్బాయికీ పెళ్ళిచెయ్యడం శ్రేయస్కరం కాదని వేనోళ్ళతో ఖండించేరు. వీళ్ళ దృక్పథం మారాలంటే కొంచెం వ్యవధి కావాలని నేను అనుకుంటూ వసంతకి మెల్లిగా బ్రెయిన్ వాషింగ్ ఇచ్చేను, కలకత్తాలాంటి నగరంలో చిలకలూ గోరింకలూ ఎంత ఆనందంగా కాలం గడుపుతాయో చెప్తూ మా అబ్బాయి మంచితనం గురించి ప్రశంసలు చేస్తూ. "పో మామయ్యా, నన్నడుగుతావేమిటీ?" అని వసంత మొహం అటు తిప్పుకుని ముసి ముసిగా నవ్వుకునే స్థితికి తీసుకొచ్చిన వేళకి, "ఇక్కడొక మంచి సంబంధం కుదిరేటట్టుగా వుంది గనక. వసంతకి ఈ పదో తారీకునుంచీ వేసంగి సెలవలే కనకా డబ్బు ఖర్చు ఎక్కువయినా సరే పదకొండో తారీకు ప్లయిట్‌లో దాన్ని ఇక్కడికి పంపించు" అంటూ బావగారు రాసిన ఉత్తరం వచ్చింది.

ఆ తరవాత నెలరోజులకి అహమ్మదాబాదు నుంచి వసంతా, కలకత్తా నుంచి మా వాడు పనిచేస్తున్న కంపెనీ జనరల్ మేనేజరు శేషాద్రిగారూ ఒక్క రోజునే విశాఖపట్నం చేరారు, శేషాద్రిగారు వాళ్ళమ్మాయీ మా అబ్బాయీ వొకర్నొకరు బాగా యిష్టపడిన సంగతి చెబుతూ "ప్రస్తుత పరిస్థితుల్లో మీ అబ్బాయి మా అమ్మాయిని పెళ్ళి చేసుకోడమే ఉత్తమం" అని నచ్చజెప్పడం అయింది. "మీవాడు రెండు నెలల్లో డిప్యూటీ మేనేజర్ కావడం నాపూచీ, పైగా, మాకువున్నది ఒక్క ఆడపిల్ల! అంచేత అతను వేరే ఇల్లుకూడా కట్టుకో అక్కర్లేదు. అతను తెచ్చుకునే జీతం నెలనెలా మొత్తం మీకు పంపేసినా దేనికీ యిబ్బందిపడడు" అన్నాడు శేషాద్రిగారు మా ఆవిడతో డైరెక్టుగా.

"ఆయనేమిటంటున్నారు మామయ్యా?" అంది వసంత నాతో ఎవళ్ళూ లేకండా చూసి.

"ఆఁ, ఏదో పెళ్ళి సంబంధంలేవే, బావకి!" అన్నాను తేలిగ్గా.

"బావని అడగక్కర్లేదా?" అని వసంత అడిగిన ప్రశ్న నాకు గట్టిగా గుచ్చుకుంది గాని మా ఆవిడా మా అబ్బాయీ కలిసి ఆ పూచిక ముల్లుని సునాయాసంగా తీసేసేరు.

నాటికి నేడు బావగారు చెప్పా చెయ్యకుండా వసంతని తీసుకుని హటాత్తుగా దిగేరు.

"ఎదురు మేనరికం అని మావాణ్ని అప్పట్లో వొదిలేశారు. గోత్రం వొకటైపోయిందని సుబ్బారావుగారబ్బాయిని జార్చేసేరు. నియ్యోగుల ఇంటిలో ఎలా యిస్తామంటూ సీతారామయ్యగారి పిల్లాణ్ణి కాదనీసేరు. వసంత అంటే నా కెంత వాత్సల్యం ఉన్నా, మీరందరూ కూడి ఇలా నేను తెచ్చిన ప్రతీ సంబంధాన్నీ తూలగొట్టేస్తూ వుంటే ఇంక నేనేమిటి చెయ్యడం?" అని బావగార్ని నిష్ఠూరం ఆడేను.

"అన్నీ నిజమేనయ్యా! పొరపాటే అయిపోయింది. ఇప్పుడు నువ్వు కూడా దీనికి సంబంధాలు చూడ్డం నావల్ల కాదంటూ తప్పుకుంటే అంత దూరాభారాన్నుంచి నేనేం ప్రయత్నాలు చెయ్యగల్ను? దీనికేమో తెల్లవారితే ఇరవై ఆరేళ్లు వెళ్ళిపోతాయి. బీకామ్ పేసైంది కనక దీనికన్నా ఎక్కువ చదివినవాడికే ఇచ్చి చెయ్యాలనుంటుంది. అ లెక్కని ఏ ముప్పయ్యేళ్ళవాడో కనీసం పోస్టుగ్రాడ్యుయేటో ఖాళీగా దొరకాలి మనకి. ఇంతకీ వసంత పుట్టడం అయితే మా యింటిలోనే పుట్టినా పెరగడం మీ రక్షలోనే కద! నువ్వే దాని తండ్రివి, అక్కగారే దానికి తల్లి. అంచేత ఇంక ఈ వ్యవహారం నువ్వు తేల్చవలసిందే తప్ప ఇది నావల్ల అయ్యేపనికాదు గాక కాదు" అన్నారు బావగారు.

"ఉన్నట్టుండి నేనెక్కడి సంబంధం చూసీగల్ను? పెళ్ళి కొడుకంటే బీరువాలో ఉన్న ఇస్త్రీ చొక్కా కాదుగదా. పోనీ వసంతని ఇక్కడే వొదిలేసున్నా బావుండేది. చదువై పోయిందని అక్కడికి లాక్కెళ్ళేవు. ఉట్టినే కూచోడం ఎందుకని దాని నెత్తిమీదికో ఉద్యోగం తెచ్చిపెట్టేవు. ఆ సాకుతో ఒకటీ ఈ నెపంపెట్టి ఒకటీ దానికొచ్చిన సంబంధాలన్నీ తూల గొట్టేసేరు. ఇప్పుడుట, నేనుట, వసంతకి సంబంధం చూడాలిట!" అన్నాను.

"అదే చెప్తున్నాను. వారణాసి నరిసింహంగారబ్బాయి కామేశ్వరావు ఈ వూళ్ళోనే ఏదో ఉద్యోగం చేసుకుంటున్నాడని తెలిసింది నాకు. అతనికింకా పెళ్ళి కాలేదుట. కిందటేడు వరకూ వాళ్ళ చెల్లెలి పెళ్ళయితే తప్పా చేసుకోనంటూ ఆగేడుట. ఇంతట్లోకి వాళ్ళమ్మగారు పోవడం వల్ల ఏడాది సూతకం వొచ్చి ఆగేడుట. ఈ నెలాఖర్ని వాళ్ళమ్మగారి సాంవత్సరీకం అయిపోగానే పెళ్ళి చేసుకునే ఉద్దేశంలో ఉన్నాడని తెలిసింది. ఆ పిల్లాడు కొన్నాళ్ళు నీ స్టూడెంటుట కదా! పైగా, కట్నాలూ కానుకలూ తీసుకోకూడదని ఉపన్యాసా

లిచ్చి వ్యాసాలు రాసి బహుమతులు తెచ్చుకున్నాట్ట. నువ్వు చెబితే తప్పకుండా వింటాడని బోలెడు ఆశపెట్టుకుని వొచ్చాను, కట్నం వొద్దని అతను అంటే కూడా మనకి కలిగిన కాడికి మనం ఇష్టపూర్వకంగా ఇస్తే కాదంటాడా అని నా ఐడియా. ఎలాగో మాటలు నడిపి వ్యవహారం సానుకూలం చెయ్యి బావా: నువ్వే కన్యాధారపోసి పుణ్యం కట్టుకుందుగాని!" అన్నారు బావగారు.

"ఆ అబ్బాయికి వయస్సయితే ముప్పయ్యేకహే గాని—"అని కొంచెం ఆంకేను.

"కాని, ఏమిటిటా?"

"కానీ ఏముంది? ముప్పయ్యేళ్ళకే బట్ట తలొచ్చేసింది అతగాడికి. చూసీ చూడగానే ఇదేదో రెండోపెళ్ళి బాపతులా ఉన్నాడని ఎవరికైనా అనిపిం చేస్తుంది. కాకి ముక్కుకి—"అని ఆ మీది మాట అన్లేదు నేను: ఊరికే వసంతవేపు మొహం తిప్పేను.

"అతన్ని నేను కూడా ఎరుగుదును." అంది వసంత.

*　　　　*　　　　*

కామేశ్వర్రావు ఈ వూళ్ళోనే ఉన్నాడని నాకు తెలుసుగాని అతన్ని ఈ దృష్టితో నేనెన్నడూ చూళ్లేదు, బావగారి ఆశావాదం పూర్తిగా సమర్థనీయం కాదుగాని మరీ అంత నిరర్థకం కూడా కాదని అనిపించింది. నాలుగు పాయింట్లూ ఆలోచించేక. అందుకని రంగంలో దిగేను,

ఎమ్మెస్సీ పాసయ్యేక కామేశ్వర్రావు బయోకెమిస్ట్రీలో చిన్నకోర్సుచేసి మెడికల్ రిప్రెజెంటేటివుగా కుదురుకున్నాడని తెలిసింది. ద్వారకానగర్‌లో నెలకి ఏడువందలరూపాయల అద్దె ఇస్తూ ఒక చిన్నయింట్లో సగం వాటాలో ఉంటున్నాడు. ఇన్నాళ్ళూ చెల్లెలి పెళ్ళికోసం ఆగడంవల్ల ఇంకా స్కూటరూ టీవీ అమర్చుకోలేదు. కంపెనీవాళ్ళు పెట్టించిన టెలిఫోనుంది. తల్లిపోయాక మేనమామా అత్తా వొచ్చి అతనితో ఉన్నారు. వాళ్ళకి పిల్లల్లేరు.

"కామేశ కేంపెళ్ళాడు. ఏమిటి, పని?" అని అడిగేడు, నేను చేసిన ఫోన్‌కాల్ తీసుకున్న ఆ మేనమామ. "అది ఫోన్‌లో చెప్పే భోగట్టాకాదు. నేనొచ్చి మాట్లాడతాను." అని వెంటనే బయలుదేరి వెళ్ళేను,

"వాడికి పెళ్ళి చెయ్యాలనే చూస్తున్నాం సార్. మీరు విన్నదంతా నిజమే. ఈ నెలా ఖర్న మా చెల్లెలి సంవత్సరీకాలై పోతే సూతకం గడిచి పెళ్ళికి పచ్చ జెండా వూగుతుంది." అని నా సంగతి, బావగారి సంగతి, మా వసంత సంగతి

వివరంగా అడిగేరు, దంపతులిద్దరూనూ. పిల్ల అందం, అణకువా, విద్య, వినయం. సంప్రదాయం, సంపదా వర్ణించి చెప్తే ఎంతో ఆశగా అపేక్షగావిన్నారు. బావుందంటే బావుందన్నారు. "మళ్ళీ దయ చెయ్యాలి తమరు, అబ్బాయి కేంప్ నించి ఈ రాత్రికే రావాలి మరి" అన్నారు,

"మా పిల్లని చేసుకోవాలేగాని అదృష్టం అంటే అతన్దే అవుతుంది." అన్నాను. "ప్రతిరాత్రి వసంతరాత్రి అని పాడుకోడమే ఆ అబ్బాయి పని!" అందామనుకున్నాను గాని అంత పొయిట్రీకి వాళ్ళు తట్టుకోగలరని అనిపించక నోరు కట్టేసుకున్నాను,

ఆ ఇంటి గుమ్మందిగి నాలుగడుగులు నడిచేసరికి నాకు వెనగ్గా ఒక జీపు ఆగింది. "ఏమిట్రోయి సంగతి? కొంపతీసి ఈ ఇంట్లో వున్న కామేశ్వ రావుతో పెళ్ళి సమ్మంధం మాటాడ్డానికి గాని రాలేదు కద! అయినా, నా తెలివి తెల్లారా, నీకు ఆడపిల్లలు లేరు గద, బతికిపోయేవు—పో!.......రా, జీపులో కూర్చో: ఇంటిదగ్గిర దింపేస్తాను, నేనూ అటే వెళ్తున్నాన్లే." అన్నాడు. డ్రయివర్ సీట్లో కూర్చున్న నా స్నేహితుడు సర్వేశ్వరశాస్త్రి.

ఉత్సాహం సాయంగా అంతా వివరించేను, శాస్త్రికి.

"వాళ్ళతో నువ్వెక్కడ తూగ్గలవురా?—నువ్వంటే నువ్వుకాదు. మీ బావగారే ఆయెను! కామేశ్వర్రావుకి తండ్రి సంపాదించిన ఆస్తి ఎలాగైతే ఏమీ లేదో, బాదరబందీలు కూడా అలాగే ఏమీలేవు. మంచి సంబంధమనే చెప్పుకోవాలి. ఐతే, వాడిప్పుడు ఏ సౌఖ్యం కోసమైనా ఆరునెలలుకాదు, అరగంట కూడా ఆగేటట్టుగా లేడు. కట్నాలూ కానుకలూ తప్పు అంటూ ఉపన్యాసాలివ్వడం వ్యాసాలు రాయడం అదంతా పాతకథ. వెనకటి రోజుల్లో అయితే చేతి గడియారం, స్కూటరు, ఫ్రిజ్జు, కలర్ టీవీ, వి సి ఆర్, ఇంటి స్తలం;స్వంత ఇల్లు ఇవన్నీ కంఫర్ట్సు, లగ్జరీసూనూ వాటికోసం కొంత చమట వోడ్చి కొన్నాళ్ళు వెయిట్ చేసి ఒకటీ వొకటీ సంపాదించుకోడానికి ప్రయత్నం చేసే లక్షణం ఉండేది. నీ మట్టుకు నువ్వు సర్వీసులో చేరిన ఏడేళ్ళకి కదా మొదటి సాలిగా రేడియో కొనుక్కున్నావు! అదీనీ వాయిదాల పద్ధతిమీద కొన్నావని కూడా నాకు తెలుసును. ఇప్పుడు అవన్నీ తక్షణం నెరవేరవలసిన కోరికలై కూర్చున్నాయి. పెళ్ళయిన మర్నాటి ఉదయానికే అవన్నీ వొచ్చి ఇంట్లో అమిరి పోవాలి. మా అమ్మాయిని ఇద్దామని మాట్లాడితే బైటపడ్డారు. వాళ్ళు. ఇంటి స్థలం కొనిఇవ్వాలి. ఇల్లు కట్టడానికి అవసరం అయినంత డబ్బు ముట్టచెప్పాలి.

ఇంట్లో పేర్చుకుందికి ఈ అధునాతనమైన సామగ్రి, సుఖదాయకమైన వస్తు సముదాయం అంతా ఇమీడియెట్‌గా జతపరచాలి. అవన్నీ పెట్టించే ఖర్చుల కోసం తను ఒక్కడూ తెస్తున్న జీతం సరిపోదు కనక అమ్మాయికూడా నెలకో రెండువేలు తెచ్చే ఉద్యోగం ఏదైనా చేస్తే మంచిది. నువ్వూ నేనూ అయితే జీతాల్లో కాణీ పరకా మిగిల్చి ముందు పుస్తకాలూ, క్రమంగా రేడియో, కాన్నేళ్ళ తరవాత చేతిగడియారం దగ్గిర్నుంచీ అన్నీ ఇలా కొనుక్కున్నాం. ఇప్పుడు అదంతా మారిపోయింది.

"మొల్లో మొగతనపు చిహ్నం ఉండి చేతిలో మెట్రిక్లేషన్ సర్టిఫికేటు ఉంటే చాలు, లక్షదాటుతోంది ఆశ! నేను మొగ పుట్టుక పుట్టేను, నన్నూ నా శక్తిసామర్థ్యాలనీ నమ్మి నా ఇల్లాలుగా రావడానికి సిద్ధపడే ఆడపిల్ల అంటూ ఉంటే అది నా పట్ల చూపించే ప్రేమకీ అపేక్షకీ కనీస ప్రతిఫలంగా దానికి రెండుపూటలా ఇంత అన్నంపెట్టి ఏడాదికో చీరకొనే మొగతనం నాకు ఉన్నాది-అనే ధోరణి మెల్లిమెల్లిగా యువతరం ఆలోచనల్లోంచి తప్పుకుంటోంది రా, గోపాలా! ఇదీ, ఇవాల్టి వివాహ వ్యవస్థ ఏర్పరచుకుంటున్న నేపథ్యం.ఇంక నీ ఓపిక." అని చావు కబురు చల్లగా చెప్పేడు శాస్త్రి. (చావు కబురు కాదు: పెళ్ళి కబురే.)

* * *

"ఏం ఫరవాలేదు లెండి బావగారూ! ఎలాగోలాగ బేరమాడి సెటిల్ చేద్దాం. ఊరికే బెంగ పెట్టుకూచుంటే పన్లు అవుతాయా? మీరు మీ పన్లు చేసుకొంటూ ఉండండి. ఇంకా నయం కాదూ? ఇప్పటికైనా వసంతని ఇక్కడ వొదిలి వెళుతున్నారు!" అని ధైర్యం చెప్పి ఆయన్ని ఆ రాత్రి కోణార్క ఎక్స్‌ప్రెస్ ఎక్కించి ఇంటి కొచ్చేను.

రాత్రి రెండున్నరదాటింది. ఐనా నిద్దర రాలేదు.నెత్తిమీద పడ్డ బాధ్యతని చూసి బెదిరిపోయి నిద్దర చెదుర్చుకొనే తత్వం కాదు, నాది, బాధ్యత నెరవేర్చే అవకాశం దొరికినందుకు ఆనందించే తత్వమే తప్ప. "నువ్వెళ్ళి మీ అత్తతో బాటుగా గదిలో పడుకోవే, వసంతా!" అని నేను హాల్లో సోఫా-కం-బెడ్డుమీద వాలేను. పక్కనే ఉన్న పెద్దలైటు స్విచ్చి ఆఫ్ చేసేనుగాని, సరిగ్గా ఎదురుగుండా గోడకి వేలాడుతున్న గ్రూప్‌ఫొటో మీద పడిన అప్రయత్నమైన దృష్టి ఆ దృశ్యాన్ని మరోసారి చూడమంటే మళ్ళా స్విచ్‌ని ఆన్‌చేసేను.

ఆ గ్రూప్‌ఫోటో ఆరేళ్ళనాటిది, అందులో ఐదుగురం ఉన్నాం, మంచి

ఎన్లార్జిమెంటు అది. "ఎడమనుండి కుడికి వరుసగా" మా ఆవిడ నేను,వసంత, మా చెల్లెలు, మా అబ్బాయి. మా ఆవిడ చిరునవ్వులో ఉన్నది గడుసు తనమో చిలిపితనమో నాకు ఆ ఫోటో ఎన్ని వందల సార్లు చూసినా అర్థంకాదు. నా పక్కని నుంచున్న వసంత ఇంచు మించు నా అంత ఎత్తు. ఎవరో ఫోటో తీస్తారేమో అని బిగుసుకు పోయే రకం కాదు, వసంత, చనువుగా నా బుజం మీద చెయ్యేసి నుంచుంది. దానికి బేలన్స్‌గా మాచెల్లెలు మా అబ్బాయి జెబ్బ పట్టుకుని ముందుకి కొద్దిగా వొంగి వుంది. మా అబ్బాయి కెమెరా లెన్స్ వైపు కాకుండా ఇటువేపుకే చూస్తున్నాడు కాని, అది నావేపు కావచ్చు, మా ఆవిడ వేపు కావచ్చు; అంతే తప్పా వసంత వేపు అని అనిపించదు.

ఆ పక్కని అన్నీ వసంత ఫోటోలు. ఐదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు జబ్బల్లో, కండల్లో, బుగ్గల్లో పుష్టిగా ఉన్నప్పటిది ఒకటి; పదేళ్ళ వయసప్పుడు లాగూ గవునూ మానేసి పరికిణీ జాకెట్టూ వేసుకున్న కొత్తల్లోది; గిర్రున తిరిగి చప్పున కూచున్నపుడు పరికిణీ బుట్టలా పరుచుకుంటే ఠపీ మని శ్నాప్ కొట్టినది. ఆతరవాత వసంతకి ఇరవై ఒక్క ఏళ్ళప్పుడు మా అబ్బాయీ కోడలూ తనూ స్టూడియో కెళ్లి తీయించుకున్నది. దానికవతల ఆ మరుచటి ఏడాది వసంత డిగ్రీ పాస్ అనిపించుకున్నప్పుడు అద్దెగౌనూ అద్దెటోపీ వేసుకుని కాన్వొకేషన్ హాల్ లాన్స్‌లో తీయించుకున్నది. బహుశా అప్పుడు నేను చేసిన వేళాకోళం—"ఓసే వసంతా, నీ తల ఇంత ప్లాట్ గా తయారైందేమే" అన్నది వసంతకి గుర్తు రాక పోతే బావుండును.

నా దగ్గిర పెరిగి నా అపేక్షకీ వాత్సల్యానికీ పాత్రురాలైన వసంత. కామన్ సెన్స్ అంటే కామన్‌గా ఎవరికీ ఉండని సెన్స్ అని నేనంటే స్పందించిన వసంత. పన్నెండేళ్ళ వయస్సు దాటినా అర్థ రాత్రి దాటేక నా పక్కలోకి చేరి "మామయ్యా నీదెగ్గిర పడుకోవొద్దా- అంటూ"నాకొక చిన్నారి బిడ్డ, నన్ను అపేక్షగా గౌరవంగా చూసే ఆడపేగు ఉందిలే- అనే ధైర్యం కలగ జేసిన వసంత. "నాకా బట్టల మిల్లులో ఉద్యోగం ఎందుకు మామయ్యా నీ సెక్రెటరీగా వేసీసుకుంటే బావుణ్ణు కదా"అని నన్ను గొప్ప మానసిక సుఖం కోసం ప్రలోభ పెట్టిన వసంత.

ఎంతకని చూసేది! కాని ఎలా మరిచి పోయేది? ఎవడి కిచ్చిముడి పెడతానో గాని, వాడికి అర్హత ఉన్నా లేకపోయినా వాడి జీవితం "ప్రతి రాత్రి వసంతరాత్రి" అని "పాటలాగ పాడాలి."....

o o o

"ఎంతమాట అన్నారు మేష్టారూ! మీరు నిజంగా నమ్మే అన్నారా, మేష్టారూ? మీ రవన్నీ నమ్మితే అంతకన్నా అవమానం నాకు వేరే ఉండదు మేష్టారూ. ఇప్పుడు మీరు లెక్చరరు కాక పోవచ్చు. నేను స్టూడెంట్ కాలేక పోవచ్చు. కాని మన మధ్య ఉన్న గురుశిష్యబంధం—డోంట్యు థింక్ ఇటీజ్ సమ్ థింగ్ ఇటర్నల్?"

"మరి ఊరంతా అనుకుంటున్నారే, నీకు ఆశ ఎక్కువ అని?"

"అలా ప్రచారంలో పెట్టవలసొచ్చిందటే మీరు కూడా నమ్మారు మేష్టారూ! ఒక ఫైవ్ స్టార్ హోటల్ ఉందనుకోండి, అక్కడ ప్లేటు ఇడ్లీ ధర ఎంతుంటుంది? ఎనిమిది రూపాయలుండొచ్చు. నోటుసే—అడ్డమైన వాళ్ళూ వచ్చేసి ఇడ్లీ పట్రా - సాంబారు ఇంకొంచెం పొయ్యి - అని న్యూసెన్స్ చేసేకుండా ఆ ధరల్యలా ఫిక్స్ చేసి అన్ వాంటెడ్ క్రౌడ్‌ని దూరంగా ఉంచుతారేతప్ప అది రియల్ కాదు, మేష్టారూ!— నిజం, మీరెలా చెప్తే అలాగే! మీ మేనకోడలికి నా ఆకారం అసహ్యం కాకపోతే నా కంతేచాలు. మిగిలిన మర్యాదలన్నీ బాష్. బంకమ్, ఏర్ బబుల్!"

"థేంక్యు, థేంక్యు మైచైల్డ్!!" అని ఆనందంగా అరిచాను

"ఛి, ఛి! ఏంటి మామయ్యా, చూడు! నేను, వసంతని. చైల్డ్‌కాదు! "గో మేన్," "ఆరెలుక్ హియర్, మేన్," అంటావే— ఆ మేన్!"

కళ్ళు తెరిచాను. వసంత చెయ్యివదిలెయ్యాలని అప్పటికి గానీతట్టలేదు....

"సారీ, వసంతా! ఏదో కల— నేనొక మొగ అబ్బాయికి షేక్హాండిస్తున్నట్టు—"

"సర్లె," అంది వసంత అల్లరిగా బుంగమూతి పెట్టి, "నాకొచ్చినకల నువ్వేచూసినట్టు మాట్లాడు తున్నావు."

"నీకా, కలా? ఏంటది?"

వసంత ఓ పట్టాన చెప్పలేదు, తనకొచ్చిన కల ఏమిటో,

రాత్రి టి.వి.లో సెక్స్ మార్పిడి ఆపరేషన్ గురించి చూపించేరు, ఆ సంగతి నాకు గుర్తుచెయ్యటం కోసం బోలెడు డొంకతిరుగుడు పెట్టింది.

"నువ్వేమో, నన్ను వొదిలించు కోవాలని—....... కేరళా తీస్కెళ్ళి— .... అదేదో హాస్పటల్లో .... ఆపరేషన్.... చేయించేశావట....... నేనేమో అబ్బాయినైపోయానట! *